ఓం్శ్రీసాయిరాం

ప్రేమస్వరూపులారా!

ప్రియమైన వాక్యము మానవులకు అత్యంత ఆనందము చేకూరుస్తుంది. ఇట్టి ప్రియమైన వాక్యములకు కొదువ లేదు. ప్రతి మానవుడు ప్రియమైన వాక్యములను ప్రపంచమునకు అందించాలి.

అణువు కంటెను సూక్ష్మమై అలరుచుండు
ఘనము కంటె ఘనమై కనుపించుచుండు
అణువె ఘనమున ఘనమె అణువుగనుండు
అణువె ఆత్మయె ఆత్మయె అణువుగనుండు.

విశ్వమంతయు, దృశ్యగోచరమైన చరాచర ప్రపంచమంతయు అణువుయొక్క స్వరూపమే. త్రాగే నీరు, పీల్చే గాలి, వినే శబ్దము సర్వమూ అణుస్వరూపమే. పంచభూతములు అణుస్వరూపమై వున్నాయి. ఇట్టి పంచప్రాణముల స్వరూపము జగత్తు. కనుకనే, జగత్తునే భగవత్‌స్వరూపకంగా ప్రాచీనులు గుర్తిస్తూ వచ్చారు. అణువును పరిశోధన చేయక అనంతకాలమైన దీనిలో అణుశక్తిని పరిశోధన గావించే ఒకానొక దీనిలో ఆధ్యాత్మిక తత్త్వమును సరియైన రీతిలో అనుభవము గావించుకొని ఒకానొక కాలములో భారతీయులు భూమిని ఆరాధిస్తూ వచ్చారు. భూమియందు పంచభూతములు సమ్మిళతమై వుండుటచేత భూదేవి అని ప్రార్థిస్తూ వచ్చారు. రెండవది గంగాదేవి జలమును కూడా దేవతగా విశ్వసిస్తూ వచ్చారు. మూడవది అగ్నిదేవుడు. నాల్గవది వాయుదేవుడు. ఐదవది శబ్దబ్రహ్మము. ఈ పంచభూతములను భగవత్స్వరూపకంగా విశ్వసిస్తూ, ఆరాధిస్తూ వచ్చారు భారతీయులు. ఇట్టి విశాలమైన తత్త్వము గుర్తించుకోలేని వ్యక్తులు భారతీయుల ఆరాధనలు హాస్యాస్పదముగా చూస్తూవచ్చారు. ప్రతి అణువునకు ఒక స్వరూపమున్నది. కనుక, ప్రపంచమునందు స్వరూపము కానిది ఎక్కడా మనకు కానరాదు. ఈ స్వరూపము దైవస్వరూపము. విగ్రహారాధన సరియైనది కాదని విమర్శిస్తూ వచ్చారు. విగ్రహము కానిదేమిటో వివరించలేకపోయారు. విగ్రహారాధన మూఢాచారమనియు, మూఢనమ్మకమనియు హాస్యాస్పదము గావించుకుంటూ వచ్చారుమాత్రమేగాని విగ్రహారాధన కానటువంటిది ఎవరూ గుర్తించలేకపోయారు. ప్రతి మానవునకు ప్రప్రథమములో సమస్త పదార్థములు స్వరూపము ధరించినవి. దైవమనగా ఏదో ఒక్క ప్రదేశమునకు కాక, ఒక్క వ్యక్తియందు మాత్రమే కాక సర్వత్రా వున్నాడనే సమచిత్తాన్ని, సమభావాన్ని, సమైక్యతను గుర్తించలేకపోయాడు. సర్వత్ర అణుశక్తి వ్యాపించి వుందని విజ్ఞులు కనిపెడుతూ వచ్చారు. సమస్త భూతములందు అణుశక్తి మిళితమైనదని తెలుసుకొనటానికి 1700 సంవత్సరములు పట్టింది. కాని, దీనికి పూర్వమే బాలుడైన ప్రహ్లాదుడు ఈ సత్యాన్ని చక్కగా గుర్తించాడు.

ఇందుగలడందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందేగలడు దానవాగ్రణి వింటే.

అన్నాడు. కాని, ఏనాడో బాలుడు చెప్పిన ఈ యదార్థమును ఈనాడు ప్రాజ్ఞులైనవారు, వైజ్ఞానులైనవారు, వేదాంతులుకూడను సర్వత్ర వున్న అణుశక్తియే దివ్యమైన ఆత్మశక్తియని విశ్వసిస్తూ వచ్చారు. ఇది మైకు. దీనిని వేలితో చూపుతున్నాము. మైకును చూచిన తర్వాత వేలుతో అవసరము లేదు. ఇది పువ్వు. వేలుతో చూపిస్తున్నాము. పువ్వును చూచిన తరువాత వేలితో అవసరము లేదు. అది కెమేరా అని చూపుతున్నాము. కెమేరాను చూచిన తరువాత వేలితో పనిలేదు. అదేవిధముగా దైవమును చూచే నిమిత్తమై విగ్రహములు ప్రారంభమైనాయి. అందని చందమామను ఆ చెట్టుపైనున్నట్లుగా వేలితో చూపుతున్నాము. చెట్టు ఎక్కడ? చందమామ ఎక్కడ? వేలు ఆధారముచేతనే చంద్రుని చూడగలుగుతున్నాము. అదేవిధముగా దైవాన్ని చూచేంతవరకు విగ్రహములు అత్యవసరము. దైవమును చూచిన తరువాత విగ్రహములు అక్కరలేదు. సర్వమూ దైవమే. వివాహముకాని కన్యను 'అమ్మా! నీకాబోయే భర్త ఏరీతిగా వుంటాడు' అని అడుగుతే ఏమని జవాబు చెప్పగలదు. భర్త ఎవరో తెలియదు. తెలియనప్పుడు యిలావుంటాడు, అలావుంటాడు అని తెలియచెప్పటానికి సాధ్యముకాదు. వివాహము అయిన తరువాత తన భర్త రూపనామములు చక్కగా బోధించగలదు. అదేవిధముగా భగవంతుని ఆరాధనములు సల్పిన తరువాతనే, అర్పితముగావించుకొన్న తరువాతనే, అనుభవించిన తరువాతనే ఇట్టిది, అట్టిది అని చెప్పటానకి సాధ్యమౌతుంది. విశ్వసించక పూర్వము, ఆరాధించక పూర్వము, అర్పితముగావించుకొనక పూర్వము దైవము ఇట్టిది, అట్టిది అని ఎవరు చెప్పగలరు! కనుకనే విగ్రహారాధనపైన విశ్వాసము అభివృద్ధిగావించుకోవాలి. ఎందుకనగా సర్వమూ విగ్రహస్వరూపమే. పరమాణువుకూడా విగ్రహస్వరూపమే. అణువులకుకూడా ఒక ఆకారము వుంటున్నాది. ఆకారము లేనిది జగత్తులో ఏదీ లేదు. చాలామంది ఈ జడమైన, చైతన్యరహితమైన, నిర్జీవమైన విగ్రహమును ఆరాధన చేయటము మూర్ఖత్వముకాదా అని ప్రశ్నిస్తారు. కాని, ఇది తెలియని అజ్ఞానముచేత చెప్పే మాటలు. ఈనాడు

90 కోట్లమంది భారతీయులు చైతన్యము కలిగించే జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్నారు. ఈ పతాకాన్ని ఎగురవేసే నిమిత్తమై దానికి పూర్వం విజయాన్ని సాధించే నిమిత్తమై అనేకవిధములైన కష్టములకు గురై, కారాగారములో బంధింపబడి పడరాని పాట్లు పడ్డారు. కొంతమంది ప్రాణములనుకూడా త్యాగము చేశారు. ఇన్నివిధములైన కష్టములకోర్చి, భరించి, సహించి ఈ పతాకమును సాధిస్తూవచ్చారు. ఆగష్టు 15న గాని, జనవరి 26న గాని ఈ పతాకమును ఎగురవేసి దానికి అన్నివిధములుగా గౌరవమునందిస్తున్నారు భారతీయులు. కేవలము భారతీయులు మాత్రమేకాదు, వారివారి దేశములందు వారివారి జాతీయపతాకములను ఎగురవేసి గౌరవిస్తున్నారు. జాతీయపతాకములేకాదు, కొన్నికొన్ని పార్టీల పతాకములను ఎగురవేసి గౌరవిస్తున్నారు. ఈ పతాకము కఠినమైనదా, ఆకారమున్నదా, దానిలో శక్తి ఏమిటని విచారణచేస్తే దానిపైనున్న విశ్వాసమే దానిపై గౌరవమే. అదేవిధముగా రాతిని పూజిస్తున్నారంటే రాతిలో చైతన్యమున్నదా? జడమైనది కదా! నిర్జీవాన్ని పూజింటమెందుకు అని చెప్పేవారు ఈ సత్యాన్ని గుర్తించుకుంటే చక్కగా అర్థమౌతుంది. ఒక గజము బట్ట, కేవలము దారములతో కూడిన బట్టను పతాకముగా ఎగురవేసినప్పుడు దీనికి విలువ ఏమిటున్నది? విజయాన్ని సాధించిన విజయపతాకమేది విలువయే దానిలో వుంటున్నాది. ఆ విజయమనకు రూపము లేదు. విజయాన్ని నిరూపించేదే ఈ పతాకము. పతాకము లేకుండా విజయమునకు రూపము చూపించాలంటే వీలుకాదు. లోకములో ఐదు ఇంచిల నూరు రూపాయనోటు వుంటున్నాది. ఈ నూరు రూపాయలనోటుకు ఏవిధమైన చైతన్యమూ లేదు. దానిని ఎంత భద్రముగా దాచుకుంటున్నావు. ఈనాడు ప్రపంచములో ధనమంటే ఆశలేనివాడు కానరాడు. త్యాగి మొదలు భోగి వరకు, పామరుని మొదలు పరమహంస వరకు ఈ ధనముయొక్క ఆశ చేతనే సమస్త కర్మలు ఆచరిస్తున్నారు. ఉద్యోగము ధనము కోసమే, చదువు ధనుము కోసమే, పదవులు ధనము కోసమే, సర్వమూ ధనము కోసమే. ఈ ధనమంటే ఆశ లేనివారు లోకములో ఎవరు? ఎవరికీ ధనము చేదు కాదు. ధనాన్ని ఆరాధిస్తున్నారు. ఈ ధనమునకు చైతన్యమున్నదా? ఈ ధనమునకు ఏమైనా సద్గుణములుంటున్నవా, ఈ ధనమునకేమైనా ప్రేమ వుంటున్నదా అని విచారణచేస్తే ఏవిధమైన గుణములకు రూపమే లేదు. ఐతే అట్టి గుణములు నిరూపించే వ్యక్తికి రూపముంటున్నది. ఒక పుష్పము వుంటున్నాది. చక్కని సుగంధమునందిస్తున్నాది. సుగంధమునకు రూపమేమిటి? సుగంధమునకు రూపము లేదుగాని సుగంధమునందించే పుష్పమునకు రూపముంటున్నాది. ప్రేమకు రూపమేమిటి? ప్రేమకు రూపములేదుగాని ప్రేమను అందించే తల్లికి రూపము వుంటున్నాది. తల్లి లేక ప్రేమ ఎక్కడనుంచి వస్తుంది? కనుక, దైవము ఎక్కడ, ఎక్కడ అని వాదించే వానికి దైవము నిరూపించటానికి తగిన చిహ్నామే ఈ రూపములు. భగవంతుడు ఎక్కడ అంటే సర్వ అణువులందు భగవంతుడున్నాడు. ప్రతి అణువు భగవత్‌శక్తి స్వరూపమే. ప్రతి అణువను మనం ఆరాధించవలసినదే. అన్నింటిని గౌరవించవలసినదే. ఈ గౌరవమర్యాదలు ప్రతి మానవునకు అత్యవసరమైనవి. కాని, భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైన దేహమే ప్రధానము, ప్రమాణమని విశ్వసించి, ఇది సజీవమైన ప్రకృతి దీనియొక్క శక్తిసామర్థ్యముల నిమిత్తమై మానవుడు తనయొక్క కాలమును, కర్మను, కాయమును వ్యర్థముగావించుకొనుచున్నాడు. కాయము లేక కర్మలు లేవు. కర్మలు చేయక ఫలితము రాదు. కాయము అనింటికీ మూలకారణము. ఇది విగ్రహము. తల్లి ఒక విగ్రహము. తండ్రి ఒక విగ్రహము. గురువు ఒక విగ్రమే. కాని, ఈ విగ్రహములు విలువతో చేరినవి. దాని ద్వారానే దైవత్వము పొందటానికి సాధ్యమౌతుంది. ఆకారము లేని ఆరాధన జగత్తులో కానరాదు. ఆకారము లేని ఆరాధన కేవలము మూర్ఖత్వమే. అట్టి మూర్ఖత్వము కలిగిన వ్యక్తులే ఆకారమును పూజించరాదనే ప్రచారము చేస్తుంటారు. సర్వమతములందు ఒక్కొక్క విశ్వాసమునకు ఒక్కొక్క ఆకారముంటున్నాది. ఒక చిన్న ఉదాహరణము. ప్రకృతి. ప్రకృతికి ఆకర్షణశక్తి వుంటున్నది. ఈ భూమియే పంచభూతములను మిళితము గావింటుకొంటున్నది. ఈ భూమి ద్వారానే మనకు ఆహారము లభ్యమౌతున్నది. ఈ పృథ్వి వలనే సమస్త లోహములు మనకు లభ్యమౌతున్నాయి. మానవుని నిత్యజీవితములో సంరక్షించేది పృథ్వియే. కాబట్టి, పృథ్విని ఆరాధనచేయటములో దోషము ఏమిటి? మనకు సర్వమును అనుగ్రహించేదానికి కృతజ్ఞత చెప్పనక్కరలేదా? ఆ కృతజ్ఞతయే ఆరాధన. ప్రతి మానవునికి పంచభూతములుంటున్నవి. ఈ పంచభూతములు లేక మానవుడేకాదు. జీవుడేకాదు. కనుక, వీటికి కృజ్ఞత చెప్పనక్కరేదా? ప్రకృతి వుంటున్నాది. ఈ భూమికి ఆకర్షణశక్తి వుంటున్నాది. దీనినే అయస్కాంతశక్తి అంటారు. భూమికి మహా శక్తివంతమైన ఆకర్షణశక్తి వుంటున్నాది. ఈ ప్రకృతికి సమీపించిన ప్రతి పదార్థమును ఆకర్షిస్తున్నాది. ఈ ఆకర్షించిన ప్రతీ వస్తువునకు ఈ ఆకర్షణశక్తినందిస్తున్నాది. చాలామంది వైజ్ఞానికులు యిప్పుడిప్పుడే గుర్తించటానికి ప్రయత్నిస్తున్నారు. దేవాలయము వుంటున్నాది. దేవాలయములో దేవుని దర్శనార్థమై వేలాదిమంది ప్రవేశిస్తున్నారు. భూమి ఆకర్షణశక్తి ఆ విగ్రహములో వుంటున్నాది. వేలాదిమంది ఇక్కడ చేరినప్పటికీ వారిలోనున్న భావనాశక్తి ఆ విగ్రహము ఆకర్షిస్తుంది. కనుకనే, ఆ విగ్రహముయొక్క ఆకర్షణశక్తి అధికమైపోతుంది. ఆరాధన చేసేవారికికూడా ఆ శక్తి మరింత అధికమౌతుంది. ఎట్లనగా, పది అయస్కాంతముల దగ్గర రెండు మేకులు వుంచి చూడండి. రెండుమూడు దినముల తరువాత ఆ అయస్కాంతశక్తి మేకులకు కూడా చెరిపోతుంది. అదేవిధముగా ఒక దేవాలయములో మనం ప్రవేశించినప్పుడు మన భావనాశక్తి ఆ విగ్రహములో ప్రవేశిస్తుంది. ఈ వేలాది, లక్షాలాదిమంది భావనాశక్తితో ఆ విగ్రహము మరింత శక్తివంతమౌతుంది. ఆ శక్తివంతమైన విగ్రహము అందరిని శక్తివంతము చేస్తుంది. జగత్తునందు శక్తిహీనమైనది ఏదీ కానరాదు.

సర్వత్రా అణుశక్తి వుంటున్నాది. ఇలాంటి అణుశక్తి స్వరూపాన్ని, స్వభావాన్ని మనం చక్కగా గుర్తించినప్పుడే దైవతత్త్వము చక్కగా అర్థమౌతుంది.

శంకర. శం- అనగా ఏమిటి? గాలివలె సర్వత్రా వ్యాపించినది. గాలి ఏవిధముగా వ్యాపిస్తూ వుంటుందో ఆవిధంగా వ్యాపించినది శం అనే శక్తి. ఆనందముతో కూడినది ఈ కర. ఆనందించేవాడు శంకరుడు. నిత్యానందమును, సచ్చిదానందమును, బ్రహ్మానందమును, అద్వైతానందమును సర్వమును అందించేది శంకర. ఆనందమును చేకూర్చునది అని ఈ శంకర శబ్దమునకు అర్థము. రెండవది ఈశ్వర. ఈశ్వర అనగా సకలైశ్వర్య స్వరూపుడు. ఐశ్వర్యమనగా ఏమిటి? కేవలము ధనకనకవస్తువాహనములుమాత్రమే కాదు. ఆనందము ఐశ్వర్యమే. ఆరోగ్యము ఐశ్వర్యమే. మేధాశక్తి ఐశ్వర్యమే. భుజబలము ఐశ్వర్యమే. మానవునియందు సర్వస్వమూ ఐశ్వర్యస్వరూపమే. సకలైశ్వర్యములు చేకూర్చేది ఈశ్వరత్వము. అయితే ఈ ఆనందమునకు రూపము ఏమిటి? ఆనందమునకు అనుభవమే రూపము. ఆనందము దైవమునుండే ప్రసాదింపబడుతుందిగాని అన్యమార్గములో మనకు లభ్యము కాదు. సర్వత్రా వున్నది ఆనందమే. కాని, కనిపించదు. కనుపించకపోయినంత మాత్రమున లేదని వాదించకూడదు. ఈశ్వరత్వము సర్వత్రా వ్యాపించినది. మానవత్వములో అట్టి విశ్వాసము కోల్పోయి, అవిస్వాస స్వరూపులై ఆనందమునకు దూరమై అశాంతికి దగ్గరైపోతున్నారు. విశ్వాసము లేని జీవితము జల్లెడలో పోసిన నీరువంటిది. విస్వాసము చేతనే మనము దీనిని సాధించాలి. దైవత్వము సర్వత్రా వుంటున్నాది. దైవత్వము లేనిది ఎక్కడా లేదు. మీరందరూ దైవస్వరూపులే. మీ అందరియందు విద్యుత్‌శక్తి, అయస్కాంతశక్తి, అణుశక్తి, ఉష్ణశక్తి సర్వశక్తులు వుంటున్నాయి. కాంతిశక్తి మన జీవితములో ప్రధానమైన శక్తి. ఈ కాంతిశక్తి ద్వారానే విద్యుత్‌శక్తి లభ్యమౌతున్నాది. విద్యుత్‌శక్తి అయస్కాంతముతో అభివృద్ధి అవుతున్నాది. ఈ అయస్కాంతశక్తి, విద్యుత్‌శక్తి రెండూ చేరినప్పుడే దివ్యకాంతి మనలో ఆవిర్భవిస్తున్నాది. ఈ దివ్యకాంతి ఎక్కడనుండో వచ్చినది కాదు. మనయందే వుంటున్నది. మన స్వరూపమే దివ్యస్వరూపము. అందువలనే నేను 'దివ్యాత్మస్వరూపులారా!' అని సంబోధిస్తాను. ఈ సత్యాన్ని మనం గుర్తించుకోలేకపోవటం చేతనే మనము దేవుడెక్కడో వుంటున్నాడని దేవుళ్ళాడుతున్నాం. దేవుడు సర్వత్రా వుంటున్నాడు. ఈ సత్యమును క్రమక్రమేణా గుర్తించటానికి ప్రయత్నించాలి. 'సత్యాన్వేషణ' అంటారు. ఏమిటి అన్వేషణ? సత్యము సర్వత్రా వుంటున్నాదే. దీనికి చిన్న ఉదాహరణము. మన కన్నులు అమ్మను చూస్తున్నాయి. అవే కన్నులు బిడ్డను చూస్తున్నాయి. అవే కన్నులు భార్యను చూస్తున్నాయి. అవే కన్నులు వంటమనిషిని చూస్తున్నాయి. అవే కన్నులు కోడలిని చూస్తున్నాయి. అయితే ఇక్కడ సత్యాన్వేషణ సలపాలి. చూచే కన్నులు ఒక్కటే కాదా! అయితే తల్లిను చూచే సమయంలో ఏ భావంతో చూడాలి, భార్యను చూచే సమయంలో ఏ తలంపుతో చూడాలి, వంటమనిషని చూచే సమయంలో ఏ దృష్టితో చూడాలి? ఇదే సత్యాన్వేషణ. వీరు నలుగురు ఆడవారే. చూచే కన్నులు ఒక్కటే. ఎవరిని ఏ భావముతో చూడాలి, అదే సత్యాన్వేషణ. అదేవిధముగా నాలుక వుంటున్నాది. అసత్యమాడేదీ నాలుకే. సత్యమాడేదీ అదే నాలుకే. పరులను దూషణ చేసేదీ నాలుకే. పరులను వర్ణించేదీ నాలుకే. ఒకే నాలుక అయినప్పుడు ఎవరిని దూషించాలి, ఎవరిని విశ్వసించాలి, ఎవరిని ప్రేమించాలి, ఎవరిని ఆరాధించాలి అనేదే అన్వేషణ. సత్యము అన్నింటియందు వున్నది. పదార్థమునకు తగిన ప్రయోగమే సత్యము. పదార్థమునకు తగిన ప్రయోగమే సత్యాన్వేషణ. ఇనుము వేలుతో కొడితే వేలు తెగిపోతుంది. వెన్నను సుత్తితో కొడితే ఛిన్నాభిన్నమైపోతుంది. దేనికి ఏవిధమైనది వుపయోగించాలనేదే సత్యాన్వేషణ. సర్వత్రా వున్న దైవత్వాన్ని అన్వేషించాలంటే మనలో భావమార్పు రావాలి. దైవభావములు ఆవిర్భవింపచేసుకున్నప్పుడే సర్వులయందు ఏకాత్మభావము మనం దర్శించవచ్చు. ఈనాడు విగ్రహారాధన కేవలము ఒక మూర్ఖత్వము కాదు. అది సదాచారమే. కారణమేమిటి? దానిని ఆధారం చేసుకొనే చైతన్యమును మనం పొందగలుగుతున్నాము. ఇంటిలోపల గోడలపై తాతలు, ముత్తాతలు వారి ఫోటోలు వేసుకుంటున్నాము. వారిని మనం చూడలేదు. వాటికి మాలలు వేస్తాం. గౌరవిస్తుంటాం. కానీ, వాటిలో ప్రాణముందా? అతనిలో ప్రేమ వుంటున్నాదా? అతని సంబంధము మనకేమైనా అర్థమవుతుందా? కాదుకాదు. అతను ముత్తాత అని అభిమానముతో దానిని ఆరాధించటము. ఆ అభిమానము లేకపోతే దాన్ని మన యింటిలో ఎందుకు పెట్టుకోటం? అదేవిధముగా ప్రతిదానియందు అభిమానమే, అనురాగమే మన నిజమైన భక్తి. అణుశక్తియొక్క విశ్వాసమే మన భక్తి. ఆ అణువే దైవము. దైవము ఎక్కడున్నాడంటే ఎక్కడెక్కడో కాదు, అన్నింటియందు వుంటున్నాడు. ఐతే తెలుసుకోటం చాలా కష్టము. నిజముగా ఆ విశ్వాసమే మనకు అభివృద్ధి అయినప్పుడు తెలుసుకోటం చాలా సులభము. అర్థము చేసుకోకపూర్వమే దీనిపైన అనేకరకములైన ఆపోహలు, అనుమానములు, వాదోపవాదములు జరుగుతుంటాయి. పూర్వము చార్వాకుడు విగ్రహారాధన దూషించేవాడు. కట్టకడపటికి వారుకూడా దీనిని గుర్తిస్తూ వచ్చారు. అణువునందుకూడా ఆకారము వుంటున్నాది కనుక ప్రపంచమంతయూ ఆకారమయమే. ప్రతి ఆకారము ఒక విగ్రహమే. నీటికి ఆకారము ఏమిటి వుంటున్నాది. ఈ టంబ్లరులో నీరుంటున్నాది. టంబ్లరు బట్టి దీని ఆకారముంటున్నాది. నీరు పోసే పాత్రను బట్టి ఆకారము చెప్పవచ్చు. గాలికి ఏమి ఆకారము వుంటున్నాది? బెలూన్‌లో ఊదితే బెలూన్ ఆకారము వస్తుంది. ఫుట్‌బాల్‌లో నింపుతే ఫుట్‌బాల్ ఆకారము వస్తుంది. ఆ గాలికి ఆకారము వచ్చింది కదా! అదే రీతిగా ఈ దేహములో ఆ దివ్యశక్తిని నింపుకున్నప్పుడు ఈ దేహముకూడా ఒక ఆకారమే. నింపుకునే భావమును బట్టి మన ఆకారము

దైవత్వముగా రూపొందుతుంది. దైవము కానిది ఈ జగత్తులో మరొకటి లేదు. 'ఇందు కలదందులేదని సందేహము వలదు'. నీ విశ్వాసముతో నీవు ఆరాధనలు సల్పు. సర్వత్రా నీకు దైవత్వమే సాక్షాత్కరిస్తాడు. దైవత్వమనేది అణువులో, ఘనములో సర్వత్రా వుంటున్నాది. అందువల్లనే గోపికలు చెప్పారు.

నిను కనుగొనగలమా కృష్ణా! నిను కనుగొనగలమా!
అణువుకంటె అతి సూక్ష్మరూపుడవు
ఘనముకంటె అతి ఘనమీయుడవు
ఎనుబదినాలుగు లక్షల జీవముల
అనయమ్మును నెడబాయకుందువట
అణురేణు తృణకాష్టము మొదలుగ
అఖండ రూపుడవై వెలయుచుందువట
ఘనమగు దొంగలలో గజదొంగవు
నిను కనుగొనగలమా కృష్ణా!

నీవు దొంగలలో దొంగవు. నీవు మంచివారిలో మంచివాడవు. ఏ ఏ పదార్థమునకు తగిన ఆ గుణముగా వుంటుంటావు. సర్వమూ నీవే. భగవద్గీతలో విభూతియోగము చూచిన వారికి భగవదవతారము ఏమిటని అక్కడే నిర్ణయమవుతుంది. అన్ని రూపములు తానే అనుకున్నప్పుడు, మలమూత్రాలుకూడా భగవంతుడేనా అని ప్రశ్నించవచ్చు. తప్పక అవికూడా భగవత్స్వరూపాలే. ఆ విశ్వాసము వుంటే, సర్వత్రా ఏకాత్మభావము వుంటే అక్కడకూడా భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. కాని, నీలో మలమూత్రములు అని భేదభావము రావటంచేత అక్కడ నీకు కనిపించడు. భేదములు రాకూడదు. సర్వమూ భగవన్మయముగానే భావించు. ఆ స్థితి చాలా ఉన్నతస్థాయి. అంతవరకు మాత్రము పవిత్రమైన ఆకారమును ఆరాధిస్తూ రావాలి. నూరు రూపాయినోటులో ఏముంది? వెదురు గుజ్జు, గడ్డిగుజ్జు చేరినదే నూరురూపాయలనోటు. దీనికి ఏమైనా శక్తి వుందా? గవర్నమెంటు మొహరు అక్కడ వుడటం వలననే దానికి విలువ యిస్తున్నాం. అదేరీతిగా ఒక ఆకారము లేని గుండును తెచ్చి శిల్పి దాని ఆకారమును తీర్చిదిద్దుతున్నాడు. దానికి ఆకారము వచ్చిన తరువాతిత ఆరాధన చేస్తున్నాము. ఒక చిన్న ఉదాహరణము. ఒకకొండలో పెద్ద గుండు వుంటున్నాది. అది చూచినప్పుడు దానిని ఆరాధన చేయాలని ఆశ రాదు. ఒక శిల్పి వెళ్ళి కృష్ణుని మాదిరి శిల్పము తీర్చిదిద్దుతాడు. అది విగ్రహంగా రూపొందుతుంది. ఆ విగ్రహమును తీసుకుపోయి దేవాలయములో ప్రతిష్ఠ చేస్తాము. కాని, గుండులోనున్న కొన్ని రాతిముక్కలు కొండలోనే పడిపోతాయి. అప్పుడు ఆ ముక్కలు చెబుతాయిట, 'ఆ గుడిలో వున్నవారము మేమే. గుండులోనుచి ముక్కలు వచ్చాము. ఒక ముక్క అక్కడపోయి ప్రతిష్ఠ అయిపోయింది. ఆ ముక్కకు ఆకారము వచ్చింది. మాకు ఆకారము లేదు. అదే భేదము' అని. ఆకారమునకు మాత్రమే ఆరాధన వస్తున్నాది. కాని, ఆకారము లేనిదీ దైవత్వమే.

నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, ముక్త, నిర్మల స్వరూపిణం. గుణము, నిర్గుణమూ రెండూకూడా దైవత్వమే. ఇలాంటి విశాలమైన భావాల్ని మనం పెంచుకోవాలి. సంకుచితమైన భావాలు పెంచుకోటం చేతనే దినదినమునకు మన సాధన దిగజారిపోతున్నది. మనం అభివృద్ధిగావించికోవాలంటే సర్వమూ దైవత్వమే, దైవత్వము కానిది లోకములో మరొకటి లేదు, ఈ విశాలత్వమును మనం పెంచుకోవాలి. అన్నింటికీ మన భావమే కారణము. దేవుడు వున్నాడంటే వున్నాడు, లేడంటే లేడు. కనుక, దైవత్వమును మనం విశ్వసించినప్పుడే సర్వస్వము మనము విశ్వసించినవారమౌతాము. కనుక, విశ్వాసమే మనయొక్క ఆరాధన. పెండ్లికాక మునుపు వరుడు ఎవరో, వధువు ఎవరో. పెండ్లి అయిన తరువాత వధువు, వరుడు సంబంధము ఏర్పడిపోయింది. మనకు విశ్వాసము లేనంతవరకు దేవుడెవరో, జీవుడెవరో తెలియదు. విశ్వాసముతో ఆరాధన జరిగిన తరువాత జీవుడే దేవుడు, దేవుడే జీవుడు. కానంతవరకే ఈ భేదములు. సంబంధము కలగనంతవరకే ఈ భేదములు. సంబంధము కలిగిన తరువాత అభేదమే. ఇట్టి అభేదత్వమును మనం పెంచుకోటానికి తగిన ప్రయత్నము చేయాలి. ప్రపంచములో సర్వస్వమూ దైవత్వమే. అణువు లేనిది మరొకటి లేదని సైంటిస్టులు చెబుతుంటారు. సైంటిస్టులు అయస్కాంత ఆకర్షణ అంటారు. కాని, వేదాంతులు 'బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి' అని. ఈ పదముల భేదమేగాని రెండూ ఒక్కటే. ఈ శక్తి సర్వమునకు వుంటున్నది. మనలో వున్నదంతా అణుశక్తియే. ఈ అణువుల చేరికయే పదార్థము. కనుక, దైవత్వాన్ని ఆకారము లేనిది, నిరాకారమని మనం భావించకూడదు. రూపములేని దానిని ఏ రీతిగా ఆరాధన చేయగలవు? ఏ రీతిగా చింతించగలవు? చూచేంతవరకు నిజమైన ఆకారము అవసరము. ఫలాన అని చూపే వరకు వేలు కావాలి. చూచిన తరువాత వేలుతో నమకు అవసరం లేదు. అదే రీతిగా నిజమైన శక్తిని చూచే వరకు విగ్రహారాధన చేసే తీరాలి. దివ్యత్వమును గుర్తించిన తరువాత విగ్రహము అక్కర లేదు.

ఈనాడు శివరాత్రి. శివరాత్రి అనగా ఏమి? మంగళకరమైన రాత్రి అని అర్థము. ఏమిటి ఈ మంగళము? ఎన్నో రాత్రులు మనం అనుభవిస్తూ వచ్చాము కదా. ఐతే కొన్ని రాత్రులు చీకటి రాత్రులుగా వచ్చాయి. ఈనాడు మాత్రం శివరాత్రిగా వచ్చింది. అనగా

మంగళకరమైన రాత్రి. దేహమునందు అనేక శక్తులుంటున్నాయి. వీటినే షట్ శక్తులు అన్నారు. ఐశ్వర్యము, ధర్మము, కీర్తి, సంపద, జ్ఞానము, వైరాగ్యము షట్‌సంపత్తి. శక్తితో కూడినవి. షడైశ్వర్య స్వరూపుడు భగవంతుడు. ప్రతి వ్యక్తియందు షడైశ్వర్యము లుంటున్నాయి. దైవము కాదని ఎట్లా చెప్పగలవు? నీవుకూడా దైవమే. దేహభ్రాంతి వుండినంత వరకు దైవాన్ని మరచిపోతున్నావు. దైవత్వము వస్తే దేహము మరచిపోతావు. దేహాన్ని మరచిపోయేంతవరకు దైవభ్రాంతి పొందటానికి వీలుకాదు. దేహమనే అభిమానము పెంచుకున్నంత వరకు దైవాభిమానము రాదు. కొంతమంది రామకృష్ణ పరమహంస దగ్గరకి వచ్చారు. 'స్వామీ! మీరు దైవాన్ని చూచారా?' అని అడిగారు. ' ఆ చూచాను. నీవు నన్ను, నేను నిన్ను ఏరీతిగా చూచుకుంటున్నామో ఆ రీతిగా చూస్తున్నాను' అన్నాడు. 'నాకు కనిపించటం లేదే?' 'నాయనా! ధనము కోసము ఏడుస్తున్నావు. బిడ్డల కోసము ఏడుస్తున్నావు. భార్య కోసం ఏడుస్తున్నావు. బంధువుల కోసం ఏడుస్తున్నావు. దైవము కోసం ఏడుస్తున్నావా? దైవము కోసం ఏడు. తప్పక దైవం కనిపిస్తాడు. నీవు లోకం కోసం ఏడుస్తున్నావు'.

పుట్టినపుడు ఏడ్చినారు చచ్చినపుడు ఏడ్చినారు
మధ్యమధ్య విషయాలకు ఎందుకెందుకొ ఏడుస్తారు
ధర్మగ్లాని సంభవింప ఉద్ధరింప ఏడ్చినార?
సత్యస్వరూపునికై ఏడ్చినార ఎపుడైన?
ఎందుకోసమేడ్చినారు? ఏడ్పుకోసమేడ్చినారు.

ఏడుస్తున్నాము. మనము దేనికోసం ఏడుస్తున్నాము? ధర్మం కోసం ఏడుస్తున్నామా? దైవం కోసం ఏడుస్తున్నామా? దైవం ఎట్లా కనిపిస్తాడు? దైవం కోసం ఏడు తప్పక కనిపిస్తాడు. కేవలం గ్లిసరిన్ వేసుకొని ఏడిస్తే ప్రయోజనం లేదు. హృదయం నుంచి రావాలి ఆ ఆవేదన. తప్పక నీకు కనిపిస్తాడు. అనేకమంది బుద్ధుని దగ్గరకు వెళ్ళారు. బుద్ధుని ప్రశ్నించారు. 'ఏమిటి దైవమంటే? మీరు యింత సాధన చేశారే. మీరు సత్యము గుర్తించుకున్నారా? దైవము ఎట్లా వుంటాడు?' 'పిచ్చివాడా! ఈ వాదోపవాదములతో కాలము వ్యర్థము చేయవద్దు. దైవమే సత్యము. దైవము సత్యస్వరూపుడు. ధర్మమే దైవస్వరూపము. అహింసయే దైవస్వరూపము. అహింసతో, ధర్మముతో, సత్యముతో నీ కాలమును సార్థకము చేసుకో, అదే దైవత్వము'. మనము చేయవలసినది చేయకుండా 'దైవం, దైవం' అంటే ఎట్లా మనకు లభ్యమౌతుంది. సర్వత్రా వుండినప్పటికి మనకు అర్థము కాదు. కన్నులు లేనివానికి ఎంత శక్తివంతమైన బల్బు తెచ్చి పెట్టినా తెలియదు. ఈ విశ్వాసము లేనివానికి, గాఢమైన భక్తి లేనివానికి ఏవిధంగా అర్థము చేసుకోగలడు? కన్నులు తెరచినప్పుడు నేరుగా ఈ కర్చీఫ్ చేయి పట్టి తీసుకుంటాను. కన్నులు మూసుకుంటే ఎక్కడెక్కడో వెతుకుతాను. కారణం ఏమిటి? దృష్టి లేకపోవటం చేతనే. అదేవిధముగా దైవదృష్టి లేకపోవటం చేతనే ఎక్కడెక్కడో వెతుకుతున్నాము మనము. దైవదృష్టిని పెట్టుకో. ఈనాడు దైవదృష్టిలేని అజ్ఞానులుగా వుండటం చేతనే దైవత్వమును అర్థంచేసుకోలేకపోతున్నారు. తన తత్త్వము తాను గుర్తించుకుంటే దైవత్వము చక్కగా అర్థమవుతుంది. ప్రతి అణువు దైవస్వరూపమే. ప్రతి పదార్థము భగవత్స్వరూపమే. ఈ సత్యాన్ని తెలుసుకుంటే అహింస అక్కడే ప్రారంభమౌతుంది. ఇదే సత్యస్వరూపకంగా సాక్షాత్కరిస్తుంది. నిరంతరము దైవనామము, దైవరూపము ఈ రెండే నిజమైన నేత్రములు. ఒక నేత్రము దైవరూపము. ఒక నేత్రము దైవచింతన. ఈ రెండింటి ఏకత్వము చేతనే ఆనందము ఆవిర్భవిస్తుంది. ఈ దృష్టిని మనం లోకదృష్టిగా తీసుకోకూడదు. దైవదృష్టితో చూడు. దృష్టి మార్పు చేసుకో. సృష్టి మార్పు చేయటం వీలుకాదు. ఈ సృష్టిని మార్పు చేయటానికి ప్రయత్నిస్తున్నారు. అందువలనే లేని రియాక్షన్స్ అన్నీ వస్తున్నాయి. చాలా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అపకీర్తులు పొందుతున్నాము. కాదు, కాదు. ప్రకృతిని దైవదృష్టితో చూడాలి. ఏమి చూచినా దైవదృష్టితో చూడాలి. దీనిని మనము ప్రాక్టీస్ చేయాలి. దీనినే భగవద్గీత

శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే
ధ్యానాత్కర్మఫలత్యాగః త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్.

పుట్టిన బిడ్డ తక్షణమే పరుగెత్తమంటే పరుగెత్త లేదు. కొంచెము దోగాడాలి. తరువాత కూర్చోవాలి. తరువాత లేచి పడాలి. గోడను పట్టుకొని నడవాలి. తరువాత క్రమక్రమేణా పరుగెత్తటానికి ప్రయత్నించాలి. ఈ అభ్యాసములు ప్రాకృతమైనవిగా వుండాలి. మీరు దైవము సర్వత్రా వున్నాడని ప్రాక్టీసు చేయండి. ప్రతి ఒక్కటీ మనకు ప్రాక్టీసే. మాట, నడక, వ్రాత అంతా ప్రాక్టీసే. మొట్టమొదట మీరు అభ్యాసమును ప్రారంభించండి. ఏమిటి తెలుసుకోవాలి? ఇదంతా అణుశక్తియే. భూమికి ఆకర్షణశక్తి వుంది. ఆ ఆకర్షణశక్తియే దైవత్వము. అదే దైవత్వమును సమగ్రంగా చూపేది. సర్వశక్తులను ఏకంగావిస్తుంది. దీనినే న్యూటన్ చక్కగా చెప్పాడు. ఆయన కనుక్కోక పూర్వము కూడ భూమికి ఆకర్షశక్తి వుంది. కాని, ఆయన పరిశీలన చేశాడు. పరిశోధన చేశాడు. గుర్తించాడు. అట్లనే మీరుకూడా పరిశీలనచేసి మీరుకూడా కనుక్కోవచ్చు. పరిశీలన చేయటం లేదు. పరిశోధన సల్పటం లేదు. వాదోపవాదములు చేస్తున్నాము. కాలము వ్యర్థము. జీవితమే వ్యర్థమైపోతుంది. ఏది చేసినా సర్వత్రా దైవముంటున్నాడు, దైవమునకు నేను మరుగు

చేయటానికి వీలుకాదు. స్వామి చూడటం లేదులే అని ఎక్కడో ఏదో చేస్తుంటారు. దైవమునకు రెండు నేత్రములు కాదు వుంటున్నవి. అనేక నేత్రాలుంటున్నాయి. నీ నేత్రముకూడా దైవనేత్రమే. నీకు తెలియక దోషము చేస్తున్నావు. నీకు నీవు మోసం చేసుకుంటున్నావు. అదే దైవాన్ని మోసం చేయటం. నీకు నీవు నమ్ముకుంటే దైవాన్నికూడా నమ్మటానికి వీలవుతుంది. ఈ విస్వాసమును మనం అభివృద్ధి గావించాలి. దైవమునకు చేతకానిది లేకములో మరొకటి లేదు. దైవము ఏమైనా చేయవచ్చును. అట్టి ప్రేమతత్వాన్ని ఆకర్షించుకునే భావములు మీలో ఆవిర్భవించాలి. ఆ ఆకర్షించుకోటానికి కొంత పవిత్రత కావాలి. అయస్కాంతము వుంటున్నాది. ఇనుపముక్క యిక్కడ పెట్టాము. కాని, ఆ అయస్కాంతము ఆ అయస్కాంతము ఈ యినుపముక్కను ఆకర్షించటం లేదు. అంతమాత్రముచేత అయస్కాంతమునకు శక్తిలేదని చెప్పటం తగదు. ఈ యినుపముక్కలో rust and dust వుంటున్నాది. ఈ rust and dust తీసివేస్తే అయస్కాంతము ఆకర్షిస్తుంది. అదేరీతిగా దైవము సర్వత్రా వుంటున్నాడు. బుద్ధిలో వుంటున్నాది rust and dust అంతాను. దాన్ని క్లీన్‌చేయి. దైవము తప్పక ఆకర్షిస్తుంది. ఆ దోషము నీలో వుంది కానీ దైవములో కాదు. నీ భావములు మార్చుకోవాలి. భావములు ఏరీతిగా మార్చుకోవాలి? సర్వమూ దైవమే అనే భావంగా మార్చుకోవాలి. ఒక చిన్న పద్యముంది శతకములో.

అక్కరకురాని చుట్టము
మొక్కిన వరమీని వేల్పు
మోహరమున దానెక్కిన బారని గుఱ్ఱము
గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ!

ఎక్కుతే పరుగెత్తని గుఱ్ఱమును వదలిపెట్టాలి. మొక్కితే వరమీయని దేవుని విడిచిపెట్టాలి. బాధలకు అక్కరకురాని చుట్టమును విడిచిపెట్టాలి. ఈ మూడూ మాత్రమే వారి అవసరమైనవి తీసుకుంటున్నారు. చివరిది ఏమిటి? సుమతీ! మంచిబుద్ధి కలిగినవానికి యివన్నీ. మంచిబుద్ధి లేక ఎక్కుతే పరుగెత్తలేదే దానిని వదలిపెట్టాలి, మొక్కితే వరమీయలేదే అని వదలిపెడితో వీడెంత మూర్ఖుడు. మొట్టమొదట సుమతి కావాలి. మంచి భావాలు రావాలి. మంచిబుద్ధి రావాలి. మంచిబుద్ధి కలగినవాడు ఎక్కుతే గుఱ్ఱము పరుగెడుతుంది. మంచిబుద్ధి కలిగినవాడు, నాకు సవారి తెలియదే, నేను గుఱ్ఱం ఎందుకు ఎక్కాలని విచారణ చేసుకొని ఊరుకుంటాడు. చెడ్డబుద్ధి కలవాడే తెలియకపోయినా గుఱ్ఱమెక్కుతాడు, క్రింద పడిపోతాడు. మొట్టమొదట మంచిబుద్ధి రావాలి. మంచిబుద్ధివచ్చినవానికే మంచి ఫలితము వస్తుంది. అన్నింటియందు విజయము చేకూరుతుంది.

ఈనాడు మహాశివరాత్రి. మంచి మంగళకరమైన బుద్ధులు మనలో పెంచుకోవాలి. మనయొక్క ప్రవర్తన పవిత్రమైనదిగా వుండాలి. భావాలు పవిత్రమైనవి రావాలి. నిరంతరము సంకుచితమైన భావాలతో నిండిపోకూడదు. ఈనాటి మానవునకు త్యాగము శూన్యమైపోయింది. ప్రతి మానవునకు మూడు చాలా ప్రధానము. దేశాభిమానము, త్యాగము, దివ్యత్వమైన దృక్పథము. ఈ మూడింటి ఏకత్వమే మానవత్వము. తెలుసుకోటం మనసు, చేయటం దేహము, సాక్షీభూతముగా వుండటము ఆత్మ. శరీర, మనస్సు, ఆత్మల సమ్మిళితమే మానవత్వము. మూడింటియందు సరైన తత్త్వము మనము గుర్తించాలి. మూడింటియందున్న దైవత్వము ఒక్కటే. అదే భిన్నత్వములోని ఏకత్వము. ఈ తత్త్వమును మనం గుర్తించుకోవాలి. అణుతత్వాన్ని మనం చక్కగా అర్థంచేసుకుంటే అంతా మనకు అర్థమైపోతుంది. ఇది ఏదీనితో తయారైంది తెలుసుకుంటే యింక వాదోపవాదములుండవు. బట్ట పత్తితో తయారైంది. పత్తే దారం అయింది. దారము నేస్తే బట్ట అయింది. కాబట్టి, బట్ట, దారము, పత్తి ఈ మూడూ ఒక్కటే. నా శరీరము, మనస్సు, ఆత్మ అన్నింటియందు అణుతత్త్వము ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించాలి. 'అణోరణీయాన్ మహతోమహీయాన్' అన్నారు. ఒక చిన్న మఱ్ఱివిత్తనం నాటితే పెద్ద వృక్షంగా తయారౌతుంది. వృక్షము ఎక్కడుంది యింతకుముందు? చిన్న మఱ్ఱివిత్తనమునందే వుంటున్నది. పెద్ద విత్తనములోపల చిన్న మఱ్ఱివిత్తనము వస్తుంది. ఈ అణువునుంచి ఘనమైంది. ఘనము నుంచి తిరిగి అణువుగా మారిపోతుంది. కాబట్టి, అణువు, ఘనము రెండూ ఒక్కటే. దృష్టిలోపమేగాని నిజంగా చూస్తే సారము ఒక్కటే. కనుక, ఈ అణుతత్త్వమును మొట్టమొదట తెలుసుకోండి. హేతువాదానికి కూడా అనుకూలమే. అనేకమంది నాస్తికులు దేవుడెక్కడని వాదిస్తుంటారు. ఇది అర్థములేని వాదన. దేవుడు కానిది ఎక్కడా లేదు. దేవుడు ఎక్కడ అని అడిగేవాడు కూడా దేవుడే. అడిగే స్వరూపము దేవుడే. దూషించేవాడూ దేవుడే. హింసించేవాడూ దేవుడే. అందరూ దేవుడే. అంతా ఒక్కటే అనే సత్యమును గుర్తించుకున్నవాడు మహాతత్త్వము గుర్తించినవాడు.

ఈ భేదములంతా వ్యక్తులలో ఆవిర్భవించినవేగాని, ఆహారవిహారములలో పుట్టినవేగాని దైవములో ఏనాడూ భేదము లేదు. అందుకోసమే ఈ విశ్వమంతా భగవంతుడు సృష్టించాడు. చిత్రవిచిత్రముగా సృష్టించాడు. అవసరమైన సమస్త సామగ్రి సృష్టించాడు. తినటానికి తిండి యిచ్చాడు. త్రాగటానికి నీరిచ్చాడు. ధరించటానికి వస్త్రమిచ్చాడు. నివసించటానికి ఇల్లు యిచ్చాడు. అన్నీ యిచ్చాడు. ఏదీ తక్కువ లేదు. 'నాయనా! ఇవన్నీ మీకోసమే యిచ్చాను. మీరే తీసుకోండి. నేను దీనిలో ప్రవేశించను. సర్వమూ మీరే

అనుభవించండి. కాని, ఒక కండిషన్ మాత్రం వుంది. ఏమిటా కండిషన్? మీరు ఏమిచేస్తారో దాని ఫలితాన్ని మీరు అనుభవించాలి. అంతే' అన్నాడు. భగవంతుడన్నీ ఇచ్చాడు. మంచి చేస్తే మంచి ఫలితము వస్తుంది. చెడు చేస్తే చెడు ఫలితము వస్తుంది. ఈ ఫలితానికి మాత్రం నీవు సిద్ధంగా వుండాలి. ఈనాడు దానికి సిద్ధంగా లేరు. మంచి చేసిన ఫలితం కావాలంటున్నారు. చెడ్డ చేసినవి వద్దంటున్నారు. లేదు. ఇది భగవదాజ్ఞ. నీవు మంచి ఫలితం కావాలంటే మంచి చేయి.

పుణ్యస్య ఫలమిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవాః
న పాప ఫలమిచ్ఛంతి పాపం కుర్వంతి యత్నతః.

పుణ్యఫలం కావాలంటున్నాడు కాని, పుణ్యం చేయటానికి ముందుకు రావటం లేదు. పాపఫలం వద్దంటున్నాడు కాని, పాపకార్యం చేయటానికి ముందుకు వస్తున్నాడు. ఇది ఎవరి దోషము? భగవంతుడు దేనికైనా సాక్షీభూతుడేగాని దేనికీ తాను కర్త కాడు. సర్వమూ సృష్టించి ప్రజలకిచ్చాడు. ఆ ప్రజలు చేసే మంచిచెడ్డలే వారు అనుభవిస్తున్నారు. దీనికి భగవంతుడు సాక్షీభూతుడేగాని మరెవరూ కాదు. ఇప్పటికైనా ఈ సత్యాన్ని గుర్తించి మంచి కార్యాలు చేయటానికి పూనుకుంటే, మంచి బుద్ధులు తెచ్చుకోటానికి ప్రయత్నిస్తే, మంచి దృష్టిని మనం అలవర్చుకుంటే యిదియే mending the mind అన్నారు. అదే

See no evil, see what is good.
Do no evil, do what is good.
Hear no evil, hear what is good.
Talk no evil, talk what is good.
This is the way to God.

ఈవిధమైన దానిని మనం నేర్చుకోవాలి. చూచేదంతా చెడుపే. తలచేదంతా చెడుపే. చేసేదంతా చెడుపే. మంచి ఎట్లా వస్తుంది? రాదు. నీవు మంచి కావాలంటే మంచి చెయ్యి. మంచి చూడు. మంచి విను. మంచిని చెప్పు. మంచిగా జీవించు. ఇలాంటివి మనము నేర్చుకోవాలిప్పుడు. ఎనిదుకంటే ఉన్నత స్థాయికి పోవటానికి ఆ స్థితిలో లేము. క్రమక్రమేణా చిన్నచిన్న మార్పులలో మనం ప్రవేశించి తదుపరి ఉన్నతమైన రాయల్ రోడ్డులో చేరిపోవాలి.

పవిత్రమైన గుణములు మనలో అభివృద్ధిగావించుకోవాలి. ఇదే శివరాత్రి ప్రధానమైన, సరైన ఫలితము. మంచి విషయములు వినాలి. శివ అనగా మంగళకరము. శివరాత్రినాడు జాగరణ అంటే సినీమాలకు పోవటం కాదు.

పేకాటనాడుచు ప్రీతితో నారాత్రి
గడిపినందులకె జాగరణమగునె
చేపలకొరకునై చెరువులో జాలర్లు
పొంచి చూచెడు దృష్టి ముక్తికగునె
తప్పసారాత్రాగి తన మేను మరచిన
మాత్రాన పరమ తన్మయతనగునె
భార్యపై నల్గియు పస్తు పరుండిన
వాడెల్ల నొకనుపవాసి యగునె
తలపు నీయందె యుంచిన కలదుగాని
భక్తి సుంతైన లేనిదే ముక్తి కలదె!
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

నాలుగు సినీమాలు చూచి రాత్రంతా జాగరణ చేశానంటే ఇది జాగరణ అవుతుందా? జా-గరణ, దైవచింతనతో వచ్చినది జాగరణ అవుతుంది. జ-పుట్టటము, గరణ- దైవత్వముతో, దైవత్వముతో పుట్టిన భావముతో ఆనాడు జాగరణ చేయాలి. మన కర్మలన్నియూ దైవముతో కూడివుండాలి. మన భావములంతా దైవముతో చేరినవై వుండాలి. అది నిజమైన జాగరణ. ఇలా ఎంతో గొప్ప అర్థాలు వుండేవి వున్నాయి. పూర్వీకులు ఒక్కొక్క పదము ఒక్కొక్క రీతిగా అందిస్తూవచ్చారు. ఆ పదాలకు ఎన్నో అర్థాలుంటున్నాయి, ఎవరికి తగిన అర్థాలు వారు తీసుకుంటారు. ఇది సరియైనది కాదు. దాని అర్థము దివ్యత్వ అర్థముగా తీసుకోవాలి. అప్పుడే సరైన అర్థము మనకు ప్రాప్తిస్తుంది. చిన్న ఉదాహరణము. పాండవులందరూ కూర్చొని విచారణ చేస్తున్నారు.

రేపటి దినము యుద్ధము ప్రారంభమౌతుంది, ఎవరెవరు ఏఏ బాధ్యతలు వహించాలి, ఏఏ దిక్కులు బయులదేరాలి అని ప్లాను వేసుకుంటున్నారు. ఆ సమయములో దుర్యోధనుడు వచ్చాడు. గురువైన ద్రోణాచార్యుడు పాండవులకు తెలియని ఒక పదమును చెప్పి పంపించాడు. దీనిలో వారు ఓడిపోతారు, వారికి అవమానమౌతుంది అనుకున్నాడు. పరుగెత్తి వచ్చాడు దుర్యోధనుడు. వీరి దగ్గరకు వచ్చి, 'ఖజగా! నాతో పోరాడనగునే నీకు' అన్నాడు. పాండవులకు ఖజగ అంటే ఏమిటో తెలియదు. ఎవరో ఒకరు అర్జునుడో, ధర్మరాజో వస్తే అవమానమైపోతుంది. పదములకు అర్థము తెలియని మూర్ఖులుగా వుంటున్నారే అనుకుంటారు. ఈ సత్యము గుర్తించిన కృష్ణుడు భీమునివైపు చూచి సంజ్ఞచేశాడు లెమ్మని. భీముడు లేచాడు. దుర్యోధనునికి అర్థము తెలియదు. తిరిగి వెళ్ళిపోయాడు. పాండవులు కృష్ణుని అడిగారు, 'స్వామీ! మా తల్లి పెట్టిన పేరు కాదే యిది. ఎవరు పెట్టిన పేరు? ఖగజ అంటే ఏమి అర్థము?' 'ఖ-ఆకాశము, గ-వాయువు, జ- పుట్టింది. ఆకాశమునకు పుట్టింది వాయువు. వాయువుకు పుట్టినవాడు భీముడు. సర్వమూ దైవమునకు తెలుస్తుందిగానీ అందరికీ తెలిసేది లేదు. ఈవిధమైన సర్వరక్షకుడైన కృష్ణుడు పాండవులను రక్షించుటచేతనే పాండవులు దిగ్విజయము సాధిస్తూ వచ్చారు. పాండవులుకూడా కృష్ణుని శరణుజొచ్చారు. ఆవిధముగా దైవమును శరణుజొచ్చినప్పుడు ఏమాత్రం ఎందులోనూ అపజయమే వుండదు. అన్నింటియందు జయమునే పొందుతాము. మనము జయమును పొందాలి, ఆనందమును పొందాలి, ఆనందమును అనుభవించాలి, సుఖాన్ని అనుభవించాలి. మంగళకరమును అనుభవించాలి అనుకుంటే దైవభావమును మనము అభివృద్ధి పరచుకోవాలి.

ఆత్మలింగ దర్శనమన్నారు, జ్యోతిర్లింగ దర్శనమన్నారు. అగ్నిలింగ దర్శనమన్నారు, వాయులింగ దర్శనమన్నారు. పంచలింగాలంతా వుంటున్నాయి. ఐతే మనస్సుకు ఈనాటి రాత్రికి సంబంధమ్యముంటున్నాది. రాత్రి చీకటి. మనస్సుకూడా చీకటే. ఐతే చంద్రమా మనసో జాతః, చంద్రునికి మనస్సుకి సంబంధము వుంది. చంద్రునిలో శక్తులు 16. ఈ పదహారు శక్తులలోపల 15శక్తులు లయమై వుంటున్నాయి. ఒక్క శక్తి మాత్రమే వుంటున్నాది. ఈ రాత్రంతా మనము, ఒకే శక్తి వుంది కనుక, సాధించవచ్చును. ఒకే వ్యక్తి 16 మందితో యుద్ధము చేయాలంటే కష్టము. 16 మంది ఒక్కనితో యుద్ధము చేయటము సులభము. ఒకే శక్తి శక్తి వుంటున్నాది ఈనాడు మనస్సులో. దీనిని సాధించాలంటే దైవచింతన చేసి సాధించాలి. దీనిలో విజయాన్ని సాధిస్తామని ఈనాటి రాత్రంతా దైవచింతన చేస్తూవచ్చారు. మనస్సులో వుండిన పదహారు కళలు దైవములో లీనమై పోయాయి. అదియే జ్యోతిర్లింగ దర్శనము. శివరాత్రి అనగా మంగళకరమైన రాత్రి. దైవచింతనచేత దిగ్విజయము సాధించాలి. ప్రాచీన ఋషులు ఈవిధమైన కర్మలాచరించి ఫలితమును పొందుతూ వచ్చారు. దివ్యత్వము అత్యంత సమీపముగా వుంటుంటాది. అయస్కాంతమనేది మనలో ఆవిర్భవిస్తుంది. దేహములోని సర్వకళలు విచ్చలవిడిగా వుంటాయి. వెంట్రుకులనుకూడా ఆకర్షింపచేసే దివ్యశక్తి ఈనాటి రాత్రి ఆవిర్భవిస్తుంది. మనలో ఒకవిధమైన శబ్దప్రమాణము ఆవిర్భవిస్తుంది. వాక్‌శక్తి వస్తుంది. కాంతిశక్తి అభివృద్ధి అవుతుంది. అన్ని శక్తులూ అభివృద్ధి అవుతాయి. అభివృద్ధికావటంచేత దివ్యతేజస్సుగా రూపొందుతుంది. దీనినే శివరాత్రి అన్నారు. మంగళకరమైన రాత్రి. దుర్గుణములు, దుచ్చింతలు ఈననాడు మనము ప్రవేశించకుండా చూచుకోవాలి. మనం తెలుసుకోవలసినది ఏమంటే, దైవమంటే ఎక్కడో వున్నాడని మనం వెతకనక్కరలేదు. మనమే దైవమనే సత్యాన్ని బాగా అభివృద్ధిగావించి నమ్మకము పెంచుకోవాలి. ఈ ఫౌండేషన్ భద్రముగా వేసుకున్నప్పుడే ఎన్ని భాధలు వచ్చినా మనము ఎదుర్కొనగలము. దైవము ఎక్కడో లేదు. మనలోనే వున్నాడు. దైవము వున్నాడు, ఉన్నాడు. ఎక్కడ? మనమే, మనమే. ఈ సత్యమును మంచిగా, పటుత్వముగా సాధించాలి.

ప్రేమస్వరూపులారా! ప్రేమయే దైవము. దైవమే ప్రేమ. మన పలుకుల ప్రేమతో వుంటుండి, మన ప్రవర్తన ప్రేమతో వుంటుండి, మన జీవితమే ప్రేమమయముగా మారినప్పుడు అంతా ప్రేమమయమే అవుతుంది.

(1995 ఫిబ్రవరి 20వ తేదీ సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)